చుట్టాలొచ్చారు !

శ్రీ అంబటిపూడి రామకృష్ణశాస్త్రి

మా తాతగారి హయాంలో మా యింటిముందు నుంచిపోయే ప్రతి నాగన్నకీ భోజనం పెట్టి మరీ పంపించేవారుట! అది రానురాను ఇటు తిరిగి అటు తిరిగి, దారినిపోయే ప్రతి నాగన్నను మేమడగవలసి వస్తుందేమో అన్న అనుమానం ప్రస్తుతం నా హయాంలో పుట్టుకొస్తోంది! బొత్తిగా అంతపని జరక్కపోయినా మా యింట్లో ఉండేవారికి (మిూకు చెప్పరానివారు!) నాకూ మాత్రం సలక్షణంగా జరిగిపోతోంది కాని, ఓ పట్టాన ఓ నలుగురు అతిథులొచ్చారంటే సలక్షణం కాస్తా విలక్షణం కాక మానదు!

అసలీ బస్తీ బ్రతుకులలోనే ఉంది ఈ చీడ అంతా. ఎవడిపొట్ట వాడు పోసుకోటానికి నానా యాతనాపడి సరిగ్గా సరిపోయేట్టు సంపాదించుకోడం! మగజాతి స్థితి నానాటికి దిగజారిపోతోంది. తెచ్చేవాడు ఒక్కడూ, తినేవాళ్లు పదిమందీ. అయినా నా అంచనా ప్రకారం మరో పదేళ్లలో మగవాడికి ఇప్పుడున్నంత బరువుండకపోవచ్చు. ఎందుచేతనంటారా - ఈ అపర అబలామణులంతా చేరి ఉద్యోగులౌదామనుకుంటున్నారుగా! వాళ్లా పని చేశారంటే కాస్త ఆ మేర బరువు వీడికి తగ్గుతుంది! పైగా అతిసంతాన నిరోధోద్యమం ఎలాగూ సాగుతోంది గాబట్టి, ఆ పుట్టిన ముగ్గురు నలుగురిని ఇద్దరూ కలిసి గుట్టుగా పోషించుకోవచ్చు! అసలు విషయం మర్చిపోయాను. సహజంగా చిన్నతనంనుంచీ, ఒంటరిగా బతకడంవల్లనేమి, పర్సులో డబ్బు లేకపోవడంవల్లనేమి, లేకపోతే బంధువులంటే భయంవల్లనైతేనేమి నామమాత్రం బంధువులాగమనం అంటే హృదయచలనం వీగిపోతుంది! అర్ధాంగి కనుక ఆవిడ కూడా ఈ విధమైన థియరీ ప్రకారం నడుస్తుందని అంతగా చెప్పక్కర్లేదనుకుంటా! అయినా ఏమో లెండి! పక్కా గుడ్డి, చెవిటి, మూగవాడైతే తప్ప ఈ రోజుల్లో ఆడదాన్ని నమ్మలేరు!

ఈవిధంగా అటు ఆఫీసు ఒత్తిడికి ఇటు ఇంట్లో వొత్తిడికి వలలో చేపలా గిలగిలా కొట్టుకుంటున్న సమయంలో... ఓ అర్ధరాత్రివేళ చెప్పకుండా పెట్టకుండా ముగ్గురు బంధువులు దిగారు! ఎందుకైన మంచిదని సాకీ వార్త చెప్పకుండా తెల్లవారేదాకా ఉంచిందట మా ఇంట్లో ఆవిడ! చాలావరకు ముఖ్య బంధువులే. వాళ్లెవరో చెప్పడం అంత సమంజసం కాదనుకోండి! తుఫానులాగ వచ్చినవాళ్లు వచ్చినట్టు ఊరుకోకుండా పిడుగులాంటి వార్తొకటి తెచ్చారు. మరుసటిరోజు కోర్టు వాయిదా ఒకటి ఉండబట్టి, ఆ మర్నాడు మరో బంధుపటాలం రాగలదని సెలవిచ్చారు. ఆ వచ్చినవాళ్లలో ఒకాయన పేరు శంకరం! మా అమ్మ మేనత్త కొడుకులెండి.

"ఫరవాలేదులెండి శంకరంగారూ! ఎంతమంది వస్తే మనకేమిటి! బాగా ఎనిమిది మందిదాకా మన యిల్లు సరిపోతుందిగా. అంతగా చాలకపోతే చూద్దాం" నెమ్మదిగా అన్నా నాలిక కొరుక్కుంటూ. "అచ్చే నేనూ అదే చూస్తున్నానురా అబ్బాయ్! ఆవచ్చేవాళ్లు మొత్తం ఆరుగురుంటారు. పన్నెండు మందికీ ఎలాగా సరిపోవడం అని ఆలోచిస్తున్నా." పిడుగు వచ్చివచ్చి సరాసరి నెత్తినే పడింది. వచ్చిన చుట్టాలు తొమ్మిది మంది! గుండెలవిశాయి!

"ఎంతమందొస్తే మనకేం లెండి బాబాయ్, ఏదో నా ఘటం ఉన్నంతవఱకు మా పూర్వీకులలానే జరిగిపోవాలని నా సంకల్పం!"

"సంకల్పం ఉండటం మంచిదే కదట్రా అబ్బాయ్! మీ తాతగారున్నప్పుడు ఇరవై ముప్పై మంది నెలల తరబడి ఉండిపోయేవాళ్లు వీళ్లన్నాళ్లు ఉండర్లే! ఓ వారం రోజులుంటారు!" చేతిలోని గరిట వదిలేసినట్లుంది మా ఆవిడ ఖంగుమని చప్పుడైంది వంటింట్లో!

నెలకో తొంభై రూపాయల జీతగాడింటికి ఓ వారం రోజులపాటు పదిమంది తింటానికొస్తే వాడికెంత బాధగా ఉంటుంది! పైపెచ్చు ఎంత కోపం వస్తుంది? చూస్తూ చూస్తూ ఆఫీసులో పనెట్లా చేస్తాడు? పోనీ ఈ బంధువులున్నారంటే వీళ్ళకేదం రోగం? ఏదో పాపం వాడూ చిన్నవాడు, ఉద్యోగస్థుడు, వాడి నెత్తినపోయి మనమంతా పడటం జేని

కని ఆ మాత్రం విచక్షణ అక్కర్లేదూ? పోనీ కనీసం మీరైనా ఉన్నారంటే ఏంలాభం? వారానికోసారి తీరిగ్గా కూర్చుని ఆ చివరనుంచి ఈ చివరిదాకా కథలు చదివెయ్యడం తప్ప అలాంటివాళ్ళకు సలహాలు చెప్తారు గనకనా?

బహుశా మీకందరికీ కోపంవచ్చి ఉంటుందేమో! ఏదో వాళ్లూ చుట్టాలు, రావలసినవాళ్లు, ఎన్నడూ రానివాళ్లు ఏదో పనిమీద చూసిపోదామని రాక రాక వస్తే ఈ వెధవాయి ఏమిటూ ఇట్లా వాగుతాడూ అనుకుంటున్నారా? నిజంగా మీరలా అనుకుంటే ఉత్త తెలివితక్కువ వాళ్ళన్నమాట! బహుశా మీకిలాంటి అనుభవం ఎన్నడూ కలిగిఉండదు. నాకు ఎప్పుడూ కలుగుతుంటుంది. అందులోనూ నెలాఖరులోనే. మోసేబరువు గాడిదకు తెలుస్తుందన్నారు పెద్దలు. అందుకనే అర్థికశాస్త్రం వెలగపెట్టిన ప్రతిమహాశయుడూ జాగ్రత్తపడుతున్నాడు! అందుకనే "...ఐదు రోజులు జరుగును గాన తమరు సకుటుంబ బంధుమిత్ర సపరివారముగా విచ్చేసి, మత్కృత చందన తాంబూలాది సపర్యలనంది నన్నానందింపజేయ గోరుచున్నాను" అని రాయడానికి బదులుగా సివిలిజేషన్ తెరలో, "వివాహమహోత్సవ దర్శనానికి తమ ఆగమనమును కాంక్షించు" అని రాసిపారేస్తున్నారు!

రోజూ అలస్యంగా వచ్చే రైళ్లు గూడా ఆ రోజు సక్రమంగా వచ్చేశాయి. తత్ఫలితంగా మూడు రిక్షాల్లో ఆ పటాలం సలక్షణంగా దిగారు. మనసులో అయితే ఎన్నో అనుకుంటాం, తిట్టుకుంటాం, కొట్టుకుంటాం గాని పైకి మర్యాదగా ఉండాలిగా! అతిథుల ఆహ్వానాలు, పలకరింపులు, కుశలప్రశ్నలు, సుజనభోజనాదులు అన్నీ అయినాయి. మధ్యాహ్నం ఉత్తరం వచ్చింది...సారాంశం చెప్పమంటారా?... అయితే వినండి. మా వేలువిడిచిన మేనత్తకొడుకు ఒకడికి ఈ ఊరు బదిలీ అయిందిట, వాడు ఇంకో ఐదారు రోజులలో వస్తాడుట. ఈరోజు రాత్రికి వాడి పిల్లా మేకా, పెళ్లాం దిగుతారుట. వాళ్లని రిసీవ్ చేసుకుని ఈ వారం రోజులూ మేపి, కాపలా కాసి, వాళ్ళతో అద్దెయిల్లు చూసి, అందులోకి పెట్టాలిట!

హరి భగవాన్! దారీ తెన్నూ లేదా ఈ సాగరానికి! ఏదో మనదే అలా అలా తేలిపోతూంటే ఈ ఉపాసులేమిటయ్యా మధ్య! బంధువులు, ప్రేమలు, అనురాగాలు, వియ్యాలు, కయ్యాలు, సానుభూతి ప్రదర్శనలు, సహాయాలూ, అవసరాలూ అన్నీ డబ్బు ఉన్నప్పుడు తప్పితే మిగతా సమయాల్లో అక్కరకు రావుగదా!

చాలామంది గుమాస్తాగాళ్ళకి అప్పులాళ్ళుంటారు. మార్వాడీ వాడొకడు, కోమటాయనొకడు, గుడ్డలవాడు, చాకలివాడు, బొగ్గులవాడు చివరికి మంగలివాడు కూడా అప్పులాళ్లు. నా అదృష్టమో దురదృష్టమో ఏ వొక్కరికీ నేను అప్పులేను! నేను అప్పులేను అని చెప్పుకోటంకంటె నాకు వాళ్లు "అప్పు ఇవ్వరు" అని చెప్పుకోటం మంచిది! కనుక ఇలాంటి ఆపత్సమయంలో అడ్డుపడే వాడెవడూ లేడు ఆ భగవంతుడు తప్పితే. ఆయన మాత్రం ఏం తక్కువ? ఈమధ్య ఆయనా నేర్చుకుంటున్నాడు అడ్డుపడక పోవటం!

పోతే మా మేనత్తకొడుకు పటాలం దిగటం విషయంలో నేనంత బాధమాత్రం పడలేదు. ఈ వచ్చిన తొమ్మిది మందీ చడీచప్పుడూ లేకుండా వచ్చేశారు. కాని, మా వాడి తాలూకు ఐదుగురూ వచ్చేముందు కాస్త నోటీసిచ్చి మరీ వస్తున్నారు! అనగా వారు దిగేలోపల కావలసిన జాగ్రత్తలన్నీ తీసుకోమని ఆదేశం అన్నమాట, ఇదికాస్త మంచిపని కాదూ మరి!

ఉద్యోగస్థుడి దుర్దినాలలో ముఖ్యం 23 నుంచి 31 దాకా. ప్రస్తుతపు సంఘటన ఆ దినాల్లోనే జరుగుతోంది. బుఱ్ఱపగిలేలా ఆలోచించినా మార్గం కనపట్టంలేదు. చిల్లరడబ్బులు అవీయివీ కలిపితే ఐదు రూపాయలు కూడా లేనట్లున్నాయి. ఇలాంటి ఆపత్సమయాల్లో సలహాలివ్వడానికి చాలామందికి మిత్రులుంటారు. నాకలాంటి వాళ్లెవరూ లేరు.

ఆపద్బాంధవుడిలా సమయానికి వచ్చాడు అయ్యర్‌గారు. అయ్యర్ మా ఆఫీసు ఎదురుగ్గా ఓ హోటలు పెట్టాడులెండి. అందుకని కాస్త ముఖతా పరిచయం ఉంది. అయ్యర్‌గారి నవనవలాడే పచ్చని బొజ్జ చూసేటప్పటికి ఆగిపోయిన మెదడు మళ్ళీ పని చేయడం మొదలెట్టింది.

"ఏం సార్! బావున్నారా?" పలకరించాను.

"ఆ! ఎంతబాగు! కాస్త అలా అలా తిరిగి దుడ్డు వసూలు చేస్తమని బయల్దేరితిని."

"అది సరేకానీ. మీ హోటల్లో రెండు రోజులపాటు రూమ్ ఒకటి కావాలి."

"పరియాచకం మాడుతున్నట్టుందరే. ఏల మీకు రూము?"

"చాల అవసరం వచ్చింది సార్! ఏమంటారు?"

"తీసుకోండి. నేను పోయి వస్తాను."

నా తెలివితేటలకు నన్ను నేను అభినందించుకున్నాను. రహస్యంగా ఇంట్లోనుంచి వెళ్ళిపోయి అయ్యారు హోటల్లో మేమిద్దరం మకాం పెట్టబోతున్నామని పాఠకలోకానికి తెలియజేయటానికి చాలా సంతోషిస్తున్నాం. మొట్టమొదట మా శ్రీమతి ఈ ప్లాను వ్యతిరేకించింది గానీ తరువాత తరువాత ఒప్పుకోక తప్పలేదు. అతిథులంతా భోజనాలు చేసి కోర్టుకెళ్ళారు. స్టేషన్‌కెళ్ళి రిసీవ్ చేసుకోడం అనేపని మానేశాను. ఇంటికి తాళంవేసి ఇద్దరం బయల్దేరబోతుండగా గొడుగు మర్చిపోయానంటూ ఒక పెద్దమనిషి వచ్చిపడ్డాడు. ఎక్కడికి ఇలా వెళ్తున్నారనే ప్రశ్నకి సమాధానం పావుగంట దాకా మాకు చిక్కలేదు. మా ఆవిడ మరీ కంగారుపడింది. ముఖమంతా పాలిపోయింది. ఆఖరికి నేనే సర్దుకుని చెప్పాను.

"ఏం లేదండీ! మా ఫ్రెండు పెళ్ళికి వెళ్తున్నాము. మళ్ళీ రాత్రికి గాని తిరిగి రాము."

"ఓ. దానికేముంది వెళ్ళిరండి. కాస్త తాళం చెవులిలా ఇచ్చి వెళ్ళండి. మేము మళ్ళీ బహుశా రెండింటికల్లా వచ్చేస్తాం."

సహస్రనామ రచన చేసేంత పాండిత్యం నాకు లేదు గానీ, ఉంటే అనువుగా ఆ పెద్దమనిషి మీదికి వదిలేసి ఉండేవాణ్ణి.

ఏం చేస్తాం! ఇవ్వక తప్పలేదు.

అయ్యారు హోటల్లో ఆవిణ్ణి విడిచి, నేనటే ఆఫీసుకెళ్ళిపోయాను. మర్నాడు సాయంత్రం ఇంటికి బయల్దేరాం. వాళ్ళంతా వెళ్ళిపోయి ఉంటారని, తాళంవేసి, పక్కింటివాళ్ళకి తాళంచెవి ఇచ్చి ఉంటారని, మా మేనత్తకొడుకు వాళ్ళంతా ఎక్కడో అక్కడ ఉండిఉంటారని ఊహాగానాలు చేస్తూ వచ్చాము. తీరా ఇంటిముందు రిక్షా ఆగేసరికి బిలబిలామంటూ ముగ్గురి పిల్లలు రిక్షాదగ్గరికి పరుగెత్తుకొచ్చారు!

మా పెంపల్లో కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. వరండాలో కూర్చుని 'గృహలక్ష్మి' చదువుకుంటున్నారు శివరాంగారు. "ఏం అబ్బాయ్? పెళ్ళిసందడి తగ్గిందా? ఏమమ్మా మరీ అలా కట్టుడు చీరతోటే వెళ్ళిపోయావేం?" ఇత్యాది ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి మా ఆవిణ్ణే నియోగించి నేనింట్లోకి వెళ్ళాను. ఎదురుగా మా మేనత్తకొడుకు భార్య నిలుచోనుంది.

"ఏం అన్నయ్యగారూ? కులాసాగా ఉన్నారా? స్టేషనుకు రమ్మంటే వచ్చారు కారూ! ఇల్లు తెలిస్తేగానీ కనుక్కున్నాననుకోండి!"

"అబ్బే! వద్దామని చాలా ప్రయత్నించానండీ! ఏదీ కుదరలా! అంతా క్షేమమేనా!" అన్నా ఆశ్చర్యం పట్టలేక.

జరిగిం దేమిటంటే, ఈ పధ్నాలుగురు చుట్టాలూ బియ్యం అవీ ఉంటాయేమోనని ఇల్లంతా వెతుకగా, అవి లేకపోగా, వాళ్ళే అన్నీ కొనుక్కొని, ఆవిడచేత వంట చేయించుకొని గడుపుతున్నారుట! నాకు, ఆశ్చర్యపడాలో, నవ్వుకోవాలో, కోపం తెచ్చుకోవాలో తెలీలేదు. కాని, వాళ్ళ ముందుకెళ్ళి నుంచోటానికి సిగ్గుతో చిక్కచచ్చిపోయాను. అయినా, వాళ్ళు మాత్రం అదేంపని? శుద్ధ మొండి ఘటాలు!!

ఆ రాత్రికి మళ్ళా వీధిలో రిక్షా చప్పుడైంది. ఈసారి ఎవరా అనుకుంటుండగా మా నాన్నగారే దిగారు! ఇక ఆయన వచ్చాడంటే ఈ విషయాలన్నీ ఆయనే చూసుకుంటాడనుకోండి!